ఎంఎల్‌సి ఎన్నికల నియమావళిని పాటించాలి

రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఆయా ప్రాంతాల్లో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని డిఆర్‌ఒలు, ఆర్‌డిఒలు, తదితరులతో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లకు సంబంధించి వెయ్యికి పైగా ఓటర్లు ఉంటే వేరే పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఈ నెల 31వ తేదీన సమర్పించాలన్నారు. ఈ ప్రతిపాదనలు రాజకీయ పార్టీల సమావేశంలో నిర్ణయం తీసుకొని సమర్పించాల్సి ఉంటుందన్నారు.

తప్పించారు.. కొట్టేస్తున్నారు..!

కొల్లేరు రైతుల జీవితాలతో అటవీ శాఖాధికారుల చెలగాటం

చేపల చెరువుల తవ్వకాల్లో ఆ శాఖాధికారులదే కీలకపాత్ర

ఇప్పుడు చెరువులకు గండ్లు కొడుతుండటంతో రైతుల్లో ఆందోళన

మొత్తం 17 వేల ఎకరాల్లో చెరువులకు గండ్లు కొట్టేందుకు ప్రణాళిక

కొంతమంది రైతులను టార్గెట్ చేస్తున్నారంటూ విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు పరిధిలోని ఏలూరు, ఉంగుటూరు, పెదపాడు, దెందులూరు, ఆకివీడు, నిడమర్రు, భీమడోలు, కైకలూరు, మండవల్లి మొత్తం తొమ్మిది మండలాల రైతుల జీవితాలతో అటవీ శాఖాధికారులు చెడుగుడు ఆడుతున్నారు. చేపల చెరువుల తవ్వకాలను అనధికారికంగా ప్రోత్సహించిన ఆ శాఖాధికారులే ఇప్పుడు కోర్టు ఆదేశాలంటూ చెరువులకు గండ్లు కొడుతున్న పరిస్థితి ఉంది. దీంతో కొల్లేరు రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా, తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. మొత్తం 17 వేల ఎకరాల్లో చేపల చెరువులకు గండ్లు కొట్టేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆరు వేల ఎకరాల్లో చెరువులకు గండ్లు కొట్టినట్లు తెలుస్తోంది. చెరువులకు గండ్లు కొట్టే వ్యవహారాన్ని అటవీశాఖ అధికారులు గుట్టుగా సాగించడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 43,724 ఎకరాలకు సంబంధించిన 1,776 చేపల చెరువులను ధ్వంసం చేశారు. పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించి, బాంబులు పెట్టి మరీ అప్పట్లో చేపల చెరువుల ధ్వంసం సాగించారు. ఇప్పుడు మాత్రం అత్యంత రహస్యంగా చేపల చెరువులకు గండ్లు కొట్టే వ్యవహారం సాగుతోంది. గతంలో కొల్లేరులో నిబంధనలకు విరుద్ధంగా తవ్విన చేపల చెరువులకు గండ్లు కొడితే అటవీశాఖ అధికారులు మీడియాకు సమాచారం ఇచ్చి ఫొటోలు సైతం అందించేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితేమీ లేకుండాపోయింది. అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2006లో కొల్లేరు ఆపరేషన్ తరహాలో మరో విపత్తు అంటూ కొల్లేరు రైతులు ఘొల్లుమంటున్నారు.

తప్పించారు.. కొట్టేస్తున్నారు

2006 ఆపరేషన్ కొల్లేరు తర్వాత అక్కడి ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా 14,218 ఎకరాల్లో జిరాయతీ భూముల్లోని చేపల చెరువులను సైతం ప్రభుత్వం ధ్వంసం చేసింది. రైతులకు కనీస పరిహారం కూడా అందించలేదు. దీంతో కొల్లేరు ప్రజలకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. బతుకుదెరువు కోసం కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. జిరాయితీ భూములను తిరిగి అప్పగించాలని, కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అక్కడి ప్రజలు ఏళ్ల తరబడి పోరాటాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొల్లేరులో ధ్వంసం చేసిన చెరువులను పునరుద్ధరించుకునేందుకు కొంతమంది రైతులు పూనుకున్నారు. అటవీశాఖ అధికారుల సాయంతోనే ఈ ప్రక్రియ సాగింది. రైతుల నుంచి పెద్దఎత్తున మామూళ్లు తీసుకుని అధికారులు గమ్మున ఉన్నారు. చెరువుల తవ్వకాలకు, ఇతర ఖర్చులకు రైతులు రూ.లక్షల్లో ఖర్చు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు కోర్టు ఆదేశాలంటూ అటవీశాఖ అధికారుల కనుసన్నల్లో తవ్విన చెరువులకే గండ్లు కొడుతున్న పరిస్థితి ఉంది. మొత్తం 17 వేల ఎకరాల్లో చేపల చెరువులకు గండ్లు కొట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో కొల్లేరు రైతులు మంత్రులను, ప్రజాప్రతినిధులను కలిసి లబోదిబోమంటున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశంలోనూ, ఎంపీ పుట్టా మహేష్, కైకలూరు, దెందులూరు ఉంగుటూరు ఎంఎల్‌ఎల ఆధ్వర్యంలో కొద్దిరోజుల క్రితం కైకలూరులో జరిగిన సమావేశంలో ఇదే అంశంపై చర్చ సాగింది. చెరువులకు గండ్లు కొట్టకుండా ఆపాలని రైతులు కోరడంతో ప్రజాప్రతినిధులు సైతం అధికారులతో మాట్లాడతామని చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

నిడమర్రు మండలంలో చెరువుకు గండికొడుతున్న పొక్లెయిన్

టార్గెట్‌గా వెళ్తున్నారా..?

అటవీ శాఖాధికారులు కొల్లేరు చేపల చెరువులకు గండ్లు కొడుతున్న తీరు అందరిలోనూ పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ముందుగా వందెకరాలకుపైగా ఉన్న చెరువులకు గండ్లు కొడుతున్నట్లు చెబుతున్నా, చిన్నచెరువులకు సైతం గండ్లు కొట్టిన పరిస్థితి ఉంది. ఒక గ్రామంలో కొన్ని చెరువులకు మాత్రమే గండికొడుతున్నట్లు చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోని చేపల చెరువుల జోలికి వెళ్లడం లేదనే చర్చ సాగుతోంది. కొంతమందిని టార్గెట్‌గా చేసుకుని చేపల చెరువులకు గండ్లు కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనంతటికీ ప్రధాన కారణం అటవీశాఖ అధికారుల తీరేనని చెప్పొచ్చు. అత్యంత గోప్యంగా ఈ వ్యవహారం సాగించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పేదల గుడిసెలు కూల్చివేత దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బుట్టాయగూడెంలో పేదల గుడిసెలను కూల్చివేయడం, దీన్ని అడ్డుకోబోయిన సిపిఎం బుట్టాయగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, ఇళ్ల స్థలాల పోరాట నాయకులు కుంజా సత్యనారాయణను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. పోలీస్, రెవెన్యూ అధికారుల తీరును ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. బుట్టాయగూడెంలోని పుంత పోరంబోకు భూమిలో ఆదివాసీ గిరిజనులు ఇళ్ల స్థలాల కోసం కొంతకాలంగా పోరాటాలు చేసి వేసుకున్న గుడిసెలను గిరిజనేతరులు జెసిబి సహాయంతో కూల్చివేయడం దుర్మార్గమని, దానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు సహకరించడం అన్యాయమని పేర్కొన్నారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో బుట్టాయగూడెం గ్రామానికి చెందిన కరాటం సునీల్, అతని సోదరుడు మరికొంత మందిని వెంటేసుకొచ్చి పుంత పోరంబోకు భూమిలో ఆదివాసీ గిరిజనులు వేసుకున్న గుడిసెలను జెసిబితో కూల్చేయడం దుర్మార్గమని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పేదలు, నేతలు అక్కడకు వెళ్లి కూల్చివేతను అడ్డుకున్నారని పేర్కొన్నారు. కూల్చివేతపై రెవెన్యూ అధికారులు వివరణ ఇవ్వాలని పేదలు రహదారిపై రాస్తారోకో నిర్వహించారని తెలిపారు. రాస్తారోకో చేస్తున్న ప్రాంతానికి వచ్చిన పోలీసులు కూల్చివేతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోకుండా రెవిన్యూ అధికారులు, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పేదలు, నేతలపై విరుచుకుపడటం, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, ఇళ్ల స్థలాల పోరాట నేత కుంజా సత్యనారాయణను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గిరిజనేతర భూస్వాములకు కొమ్ముకాసిన రెవెన్యూ, పోలీస్ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, అరెస్ట్ చేసిన సిపిఎం నాయకులను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సిపిఎం నేత రామకృష్ణను బలవంతంగా ఈడ్చుకెళ్తున్న పోలీసులు (వార్త మెయిన్‌లో..)

నేడు పెనుగొండలో చంద్రబాబు పర్యటన

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎం చంద్రబాబు శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ రానున్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో సిఎం పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నుంచి హెలీకాప్టర్‌లో సిఎం బయల్దేరతారు. 11.10 గంటలకు పెనుగొండ-సిద్ధాంతం రోడ్డులోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం గుండా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకుని, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. 11.50 గంటలకు వాసవి శాంతిధామం నిర్వహిస్తారు. 11.55 గంటలకు గురుపీఠం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తారు. 11.55 గంటలనుంచి 12.10 గంటల వరకూ వాసవి శాంతిధామం ఆలయంలో పూజలు చేస్తారు. 12.15 గంటలకు తిరిగి ఎఎంసిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 12.55 గంటలకు హెలీకాప్టర్‌లో ఉండవల్లి చేరుకుంటారు.



ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్న శ్రద్ధ పునరావాసంపై లేదు

పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతాలో నేతలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

పాలకులు మారుతున్నారు తప్ప.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల బతుకులు మారడం లేదు అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ సందర్భంగా అల్లూరి జిల్లా చింతూరులో ప్రారంభమైన పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతా గురువారం ఏలూరు జిల్లా కుక్కునూరు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక రామసింగారం సెంటర్లో జాతాకు సిపిఎం శ్రేణులు, నిర్వాసితులు, గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో దడాల సుబ్బారావు మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయలు దోచిపెట్టేలా ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వాలకు నిర్వాసితులకు పునరావాసం, పరిహారం మంజూరుపై లేకపోవడం బాధాకరమన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం నిర్వాసితులకు ప్రస్తుత మార్కెట్ రేటుకన్నా నాలుగు రెట్లు అధికంగా పరిహారం చెల్లించాలని చట్టం చెబుతున్నా దాన్ని తుంగలో తొక్కి నిర్వాసితులను ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టప్రకారం ప్రతి నిర్వాసితుడికీ రూ.15 లక్షలు పునరావాస పరిహారం ఇవ్వాలని, నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించే వరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిపివేయాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకొని మండలం యూనిట్‌గా ప్రతి నిర్వాసితునికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులను ఇక్కడి నుండి తరలించే తేదీనే కటాఫ్ తేదీగా పరిగణించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకునికి పరిహారం చెల్లించాలని, మిగులు భూములకు, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నెల్లూరులో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో తీర్మానాలు చేసి నిర్వాసితులను ఏకం చేసి సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు నిర్వహించేందుకు భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, జిల్లా కమిటీ సభ్యులు మడకం నాగమణి, పులి సంతోష్, ఏలూరు జిల్లా నేతలు వై.నాగేంద్రరావు, తాటి శాంతకుమారి, ఎం వీరాయమ్మ, వై.సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, పట్ల సీతమ్మ, మహబూబ్ పాషా, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో...

వేలేరుపాడు రూరల్: నిర్వాసితుల త్యాగాలను పునాదులుగా చేసి పోలవరం ప్రాజెక్టు కడుతున్నారని వారి త్యాగాల ఫలితమే ఈ ప్రాజెక్టు అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. పోలవరం నిర్వాసితుల పోరాట పతాక యాత్ర గురువారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్లో మడివి దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆర్‌అండ్‌ఆర్ రూ.పది లక్షలు, గతంలో సేకరించిన వాటికి ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇస్తామని ప్రజలను మభ్య పెట్టారన్నారు. ప్రజలను మోసగించిన వైసిపి ప్రభుత్వం తగిన ఫలితం అనుభవించిందన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వాసితుల త్యాగాలను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్టర్లకు మాత్రం పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లిస్తున్నారని, ప్యాకేజీ విషయంలో ఆ విధానం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.15 లక్షల ప్యాకేజీ ఇచ్చి, భూమికి భూమి, మిగులు భూములను కూడా సర్వే చేసి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ధర్ముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం: పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీలను తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సిపిఎం పోలవరం నిర్వాసితుల పోరాట పతాక యాత్ర డిమాండ్ చేసింది. యాత్ర గురువారం సాయంత్రం జంగారెడ్డిగూడెం చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో నాయకులు దడాల సుబ్బారావు, లోత రామారావు మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రారంభించి 20 సంవత్సరాలైనా ఇప్పటికీ గ్రామాలు ఖాళీ చేసి భూములిచ్చి త్యాగం చేసిన గిరిజనులకు పూర్తి పరిహారం ఇవ్వడంలో పాలకులు అత్యంత ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. నిర్వాసితుల కాలనీల్లో సౌకర్యాలు లేక గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. కనీసం ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశానాలు లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్ర వీడి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నేతలు కిషోర్, నాగమణి, ఎం.జీవరత్నం, పి.సూర్యారావు, అందుగుల ప్రభాకర్‌రావు, బి.రాంబాబు, ఎస్‌కె.సుభాషిణి, ఎస్‌కె.మాబుసుభాని, వి.గోపీ, బి.బాలరాజు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు విమర్శించారు. పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతా గురువారం సాయంత్రం ఏలూరు చేరుకుంది. ఈ సందర్భంగా ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ జాతాకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దడాల సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలను ఖాళీ చేసేందుకు బిజెపి కుట్రలు పన్నుతుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు చంద్రబాబుకు ఎటిఎంలా పని చేస్తుందనిస్వయంగా మోడీ విమర్శించారని, అదే మోడీతో చంద్రబాబు జత కట్టడం వెనుక ఆంతర్యమేమిటో జనం గుర్తించాలన్నారు. గిరిజనులకు పరిహారం, ప్యాకేజీ, పునరావాసం కల్పించాలకే ప్రాజెక్టు పూర్తి చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నిర్వాసితుల కాలనీల్లో శ్మశానాలు కూడా లేవన్నారు. 150 గ్రామాలు ముంపులో ఉంటే 25 గ్రామాలకు మాత్రమే పరిహారం ఇచ్చారని, అది కూడా పది సంవత్సరాల క్రితం ప్రకటించిన పరిహారం ఇచ్చారని, కాంట్రాక్టర్లకు మాత్రం ప్రస్తుతం ఉన్న రేట్లు ఇస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంత నాయకులు పి.సంతోష్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల త్యాగాలు రాష్ట్ర ప్రజలంతా గుర్తించి, వారికి మద్దతుగా నిలవాలని కోరారు. సభలో స్థానిక నాయకులు రవి కిషోర్, రామాంజనేయులు, వివిఎన్ ప్రసాద్, వైఎస్.కనకారావు, పి.ఆదిశేషు పాల్గొన్నారు.



కుక్కునూరులో...

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆదేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని దర్భగూడెంలో పురాతన కాలంలో వేసిన బోరు సరిగ్గా పని చేయక నీటి సమస్య వస్తుందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంఎల్ఎ గురువారం వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను సమస్య అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ కొత్త బోరు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మన సాంబ, కె.దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బాలరాజు

అమలు కాని ఎన్నికల కోడ్

ఏలూరు అర్బన్ : పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 24 గంటలు గడుస్తున్నప్పటికీ ఏలూరు నగరంలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ఎలాంటి ముసుగు వేయలేదు. ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నిక ఫిబ్రవరి 27వ తేదీన జరగనున్న నేపథ్యంలో జనవరి 29వ తేదీ బుధవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని స్వయంగా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అయినప్పటికీ ఏలూరు నగరంలోని అధికారులు మాత్రం కోడ్ అమలు విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. నగరంలో ఎక్కడ చూసినా విగ్రహాలు, రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉన్న ఇందిరా గాంధీ, ఎన్‌టిఆర్, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు ముసుగు వేయలేదు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న ఎన్‌టిఆర్, రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు ముసుగు వేయలేదు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లను తొలగించలేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకుని ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన అవసరం ఉంది.

ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఫ్లెక్సీలు

90 గంటలు పనిచేయాలనడం సరికాదు

ఎల్అండ్‌టి ఛైర్మన్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలి

ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ, కార్మిక వర్గం వారానికి 90 గంటల పని చేయాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్ఎన్‌టి ఛైర్మన్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఏలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ముందుగా స్థానిక వైఎంహెచ్ఎ హాలు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు పెద్దఎత్తున కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి యూనియన్ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కెవి.రమణ మాట్లాడుతూ భారత కార్పొరేట్ శక్తులు ఉద్యోగ కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. భారతదేశ పార్లమెంటు సభ్యులు ఈ వ్యాఖ్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలో ఉన్న కార్మిక వర్గ హక్కులను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్ శక్తులపై భారతదేశ ఉద్యోగ కార్మికులు ఒక ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడే కార్మిక చట్టాలను కాపాడుకోవడం జరుగుతుందని, ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర కార్మిక మంత్రులు, కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం సరికాదన్నారు. మంత్రులు స్పందించి కార్పొరేట్ శక్తుల అనుచిత వ్యాఖ్యలపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ కార్మికులు వారానికి 90 గంటల పని చేయాలని కార్పొరేట్ శక్తులు చెప్పడమంటే ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పని గంటల పెంపుదల సిద్ధాంతం కార్మికుల ముందస్తు మరణానికి దారి తీస్తుందని, పని గంటలు పెంచడం, విరామం లేకుండా పని చేయించడం అంటే కార్మికుల జీవితాన్ని మృత్యువు వైపు నెట్టడమేనన్నారు. భారతదేశ కార్మిక మంత్రి ఈ కార్మిక వ్యతిరేక ప్రకటనను తీవ్రంగా ఖండించాలని డిమాండ్ చేస్తున్నామని, లేకపోతే కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి మరో కార్మిక పోరాటాన్ని చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమం అనంతరం తహశీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి జట్టు కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, కోశాధికారి ముంగం అప్పారావు, ఏలూరు హమాలీ ముఠా కార్మిక సంఘం ప్రెసిడెంట్ దుళ్ల వీరినాయుడు, కూరగాయలు ముఠా ప్రెసిడెంట్ వీరభద్రం, తదితరులు నాయకత్వం వహించారు.

ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టియు నేతలు

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య వ్యవస్థలు పటిష్టం

మాతా శిశుమరణాల నివారణే లక్ష్యం

'పది' పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కెఆర్‌పురం ఐటిడిఎను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలి : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలను పటిష్టం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శంగా కెఆర్‌పురం ఐటిడిఎను నిలిపేలా అన్ని శాఖలు సమన్వయంతో సమిష్టి కృషి చేయాలన్నారు. ఐటిడిఎ పరిధిలో విద్యుత్ సౌకర్యం లేని ఏఒక్క గిరిజన గ్రామం ఉండకూడదన్నారు. గిరిజన ప్రాంతంలో రోడ్డు, టెలిఫోన్ కనెక్టవిటీతోపాటు అంతర్గత రహదారులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను వేగవంతంగా అభివృద్ధి చేయాలన్నారు. పీసా కమిటీల ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి

కేవలం గురుకుల, ఆశ్రమ పాఠశాలలే కాకుండా గిరిజన ప్రాంతంలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలన్నారు. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే దృక్పథంతో కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యంపై మరింత ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మాతా శిశు మరణాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతల విషయాల్లో దృష్టి పెట్టాలన్నారు. సురక్షిత ప్రసవాలు జరిగేందుకు అత్యంత ప్రాధాన్యతివ్వాలన్నారు. శిశువులకు నూరుశాతం అవసరమైన వ్యాక్సినేషన్ నిర్వహించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో 28 రోజుల నుండి రెండు సంవత్సరాల్లోపు శిశువుల మరణాలకు సంబంధించి బాలురు, బాలికల వివరాలు వేర్వేరుగా అందజేయాలన్నారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్‌ఫాక్స్ వంటి వ్యాధుల నిర్మూలనపై చేపట్టిన చర్యలపై సమీక్షించారు. హిమోగ్లోబిన్ పరీక్షల్లో సికిల్ సెల్ ఎనీమియా పాజిటివ్ వారిని గుర్తించేందుకు అవసరమైన పరీక్ష కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విటిజిఎస్ ద్వారా అడ్డాకుల తయారీ, వేరుశెనగ, జీడిపప్పు, చాక్‌లెట్ తయారీ తదితర అంశాలపై శ్రద్ధ చూపించాలన్నారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, ఎపిఒ పివిఎస్.నాయుడు, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ లత, ఎస్‌డిసి ఐ.కిషోర్, పంచాయతీరాజ్ ఇఇ కె.శ్రీను, ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సురేష్, ఐసిడిఎస్, హౌసింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


స్కూటర్‌ను విడుదల చేస్తున్న ఎఎస్‌పి సూర్యచంద్రరావు

మార్కెట్‌లోకి డిస్టినీ 125 స్కూటర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న సాయి స్వర్ణ హీరో మోటార్ షోరూం నుంచి డిస్టినీ 125 స్కూటర్ అడిషనల్ ఎస్‌పి సూర్యచంద్రరావు గురువారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. హీరో మోటార్ షోరూమ్ సంస్థ మేనేజర్ సోమేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు నగరంలో డిస్టినీ 125 స్కూటర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయడం ఎంతో ఖుషి పరిణామమన్నారు. ఈ స్కూటర్‌లో అనేక రకమైన ఫీచర్లు కలిగి ఉందన్నారు. ఈ వెహికల్‌ను టెస్ట్ రైడ్ చేసిన వారు పాజిటివ్ రివ్యూలు ఇచ్చారని తెలిపారు. మార్కెట్‌లో 125 సిసి వెహికల్స్‌తో పోల్చిస్తే ఈ వెహికల్ ధర తక్కువ, ఎక్కువ ఫీచర్స్ కలిగి ఉంటుందని తెలిపారు.

ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రాక్టికల్ పరీక్షలో ఎన్‌సిసి క్యాడెట్లు

ఆంధ్రా బెటాలియన్ ఏలూరు వింగ్ 19 పరిధిలోని జంగారెడ్డిగూడెం జెడ్‌పి బాలుర హైస్కూల్‌లో ఎన్‌సిసి క్యాడెట్లకు గురువారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు జంగారెడ్డిగూడెం జెడ్‌పి బాలుర హైస్కూలు నుంచి 41 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ క్యాడెట్లకు రెండేళ్లపాటు మిలటరీ డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్ శిక్షణ అందించారు. ఎన్‌సిసిఎ సర్టిఫికెట్ పొందేందుకు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈ ప్రాక్టికల్ పరీక్షకు లెఫ్టినెంట్ కల్నల్ రిషిబ్ సిన్హా, మరో అధికారి డుమినీ, ఇతర ఎన్‌సిసి అధికారులు పర్యవేక్షించారు. ఎన్‌సిసి ద్వారా విద్య ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని జంగారెడ్డిగూడెం జెడ్‌పి బాలుర హైస్కూల్ హెచ్‌ఎం కె.లోవకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సిసి కేర్ టేకర్ సిహెచ్.గంగరాజు, పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎం.విజయప్రకాష్, స్టాఫ్ సెక్రటరీ టి.జగదీష్‌బాబు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నిడమర్రు

వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా సభ్యులు కోన శ్రీనివాసరావు కోరారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘం క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు అనేక పోరాటాలు చేస్తున్నారన్నారు. రైతులు, కౌలు రైతుల సమస్యలపై సిపిఎం రాష్ట్ర మహాసభలో చర్చిస్తారని, మూడో తేదీన జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నారపల్లి రమణారావు, వ్యవసాయ కర్మ సంఘం నాయకులు గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కంచం వరప్రసాద్, కానూరు రాజు, లావేటి చంద్రరావు పాల్గొన్నారు.

పేదలకు కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రముఖ న్యాయవాది వైఎస్.దొర్రై పేదలకు గురువారం కళ్లజోళ్లను వితరణగా అందించారు. నూజివీడు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాల్లో తిరివీధి లక్ష్మీరామారావు ఛారిటబుల్ ట్రస్ట్, విజయవాడ నగరానికి చెందిన ఎస్ఎస్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపుల్లో అవసరమైన వారికి కళ్లజోళ్లను అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో అపారమైన అనుభవం గడించి, సామాజిక సేవలో ముందడుగు వేస్తున్న ప్రముఖ న్యాయవాది వైఎస్.దొర్రై చేసే సేవలన్నీ ప్రజలకు ఆదర్శనీయమన్నారు. నేటి యువత వైఎస్.దొర్రై సేవల స్ఫూర్తితో ముందడుగు వేయాలని సూచించారు. న్యాయవాది దొర్రై మాట్లాడుతూ మరిన్ని మెడికల్ క్యాంపులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పేదలకు ఎప్పుడు సేవ చేయాలన్నా తనను సంప్రదించవచ్చని న్యాయవాది వైఎస్.దొర్రై స్పష్టం చేశారు.

డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ వాహనాలు నడపడమే కాకుండా వారి ఆరోగ్యంపై కూడా డ్రైవర్లు శ్రద్ధ వహించాలని, అందుకే జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి ఉపరవాణా కమిషనర్ కెఎస్‌ఎంవి.కృష్ణారావు అన్నారు. స్థానిక ఉప రవాణా కమిషనరు కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆయుష్ ఆసుపత్రి ఏలూరు వారిచే డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాన్ని ఇన్‌ఛార్జి ఉపరవాణా కమిషనరు కెఎస్‌ఎంవి.కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన ఆయుష్ ఆసుపత్రికి, శంకర్ నేత్రాలయం డాక్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

టి.నరసాపురం : నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్వతంత్ర అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం టి.నరసాపురం చేరింది. ప్రధాన సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏలూరు నుంచి కాకినాడ వరకు పాదయాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొయ్యలగూడెం-జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై వృద్ధాశ్రమం వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన సాధు భక్తవత్సల కుమార్ (63) బైక్‌పై జంగారెడ్డిగూడెం వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్ కింద పడిపోగా అతని తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేలు, పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని లోపూడిలో నిత్యం గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందేలు, పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం అర్ధరాత్రి విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వందకు పైగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల సమయంలో జూద క్రీడల్లో పాల్గొన్న వారు పరారయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు నిత్యం లోపూడి అటవీ ప్రాంతంలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు బుధవారం అర్ధరాత్రి విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వందకు పైగా దిచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

48 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.నాగప్రభుకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామంలో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 48 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీన చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు నాగ ప్రభుకుమార్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పిఎస్‌డి భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

పలుచోట్ల వర్ధంతి కార్యక్రమాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలో పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

భీమడోలు : గ్రామ స్వరాజ్యం కోసం మహాత్మా గాంధీ కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పోలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హుసేన అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి జయరామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం మహాత్మ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచి, ఇతర ప్రముఖులు గాంధీ చిత్రపటానికి పూలమాలలను వేసి సత్కరించారు. ఇదేవిధంగా భీమడోలు గాంధీ బొమ్మ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు.

ఆగిరిపల్లి : గాంధీ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఆగిరిపల్లి మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు చలవాది వెంకటరత్నం అన్నారు. ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో ఉన్న గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాల వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వై.ప్రణీత్, ఎం.గోపాలకృష్ణ, వై.రాంబాబు, వై.శివరాం, వై.నరసింహ, ముక్తేశ్వరరావు, నరసింహారావు, జె.కోటేశ్వరరావు, టివిఎస్ కిరణ్ పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో గాంధీ చిత్రపటానికి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుమాని చిన్నికృష్ణ, బస్వాని హేమసుందర నరసింహ వర్మ, బళ్ల రాజు, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాదంశెట్టి మల్లికార్జునరావు, అద్దంకి రామకృష్ణ, నల్లూరి శ్రీనివాస్, అద్దంకి రవి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని టిడిపి మండలాధ్యక్షులు దేవినేని డలరామ్ అన్నారు. టిడిపి కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని 16 గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

రావి ఆకుపై గాంధీ చిత్రం

కొయ్యలగూడెం : గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని పులిబోయిన పూర్ణిమ ప్రతిభను ప్రదర్శించింది. ఆమె రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని చిత్రీకరించి తన దేశభక్తిని చాటుకుంది. పూర్ణిమను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎంఇఒ-1 శ్రీనివాసరావుకు పలువురు ఉపాధ్యాయులు గురువారం వినతిపత్రం అందించారు. యుటిఎఫ్ భీమడోలు శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బాలభాస్కర్, ఎం.శేఖర్, ఇతర కార్యవర్గ సభ్యులు భీమడోలు మండల కేంద్రం వద్ద గురువారం ఎంఇఒను కలిశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంశాల వారీగా వివరించారు. దీనిపై స్పందించిన ఎంఇఒ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఆపుస్మా ఏలూరు జిల్లా ఇంటర్ జోనల్ బాల, బాలికల క్రీడాపోటీలు స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మూడో రోజు గురువారం ఉత్సాహంగా జరిగాయి. అన్ని కేటగిరిల్లో బాలికల గేమ్స్ నిర్వహించారు. విద్యార్థులంతా వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారని గేమ్స్ కన్వీనర్ జెఎం.జెవియార్, ఆపుస్మా జిల్లా ప్రెసిడెంట్ ఎం.శివకుమార్‌శర్మ, సెక్రటరీ ఎన్ఆర్‌కెఎ ప్రసాద్ తెలిపారు. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఓవరాల్ ఛాంపియన్‌గా చింతలపూడి జోన్ వారు గెలుపొందారు. ద్వితీయ స్థానంలో ఏలూరు జోన్ వారు నిలిచారు.

పోలీస్‌స్టేషన్ రైటర్లకు శిక్షణ

ప్రజాశక్తి - పెదవేగి

పోలీస్ విధి నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలనే అంశంపై, స్టేషన్ రైటర్ విధులపై పెదవేగి డిటిసిలో జిల్లాలో పనిచేస్తున్న 36 మంది స్టేషన్ రైటర్‌లకు మూడు రోజులు పాటు ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పెదవేగి జిల్లా ట్రైనింగ్ సెంటర్లకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైటర్ల విధి, విధానాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న ఆధునికతను అందిపుచ్చుకుంటే సమస్యల పరిష్కారం మరింత తేలికవుతుందన్నారు. అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ స్టేషన్లో రైటర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. రైటర్లకు ఆధునిక విధానాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన రీతిలో విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ట్రైనింగ్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్‌పి అందించారు. ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి ప్రసాద్, సిఐ రామారావు, పెదవేగి ఎస్ఐ రామకృష్ణ, డిటిసి ఎస్ఐలు శానం శ్రీనివాసరావు, విజయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతకు అభయ రక్షక దళం

ప్రజాశక్తి - భీమడోలు

మహిళలు, బాలికల సామాజిక, న్యాయభద్రత హక్కుల కల్పనకు అభయ రక్షక దళం పని చేస్తుందని భీమడోలు ఎస్ఐ సుధాకర్ అన్నారు. దీని ప్రచారం కోసం ప్రత్యేకించిన అభయ వాహనం గురువారం పూళ్ల గ్రామంలో పర్యటించింది. దీనిలో భాగంగా పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమడోలు ఎస్ఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దీనికోసం అవసరమైన పత్రాలు, హెల్ప్ లైన్ సేవలు, గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు.

భూములను అర్హులకు పంచాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విఎస్ఎస్ భూములను అర్హులైన పేదలకు పంచాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. మండలంలోని గనిజర్ల శాఖ మహాసభ బోయ పుల్లయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ అర్హులైన పేదలకు విఎస్ఎస్ భూములను పంచాలని, భూ పంపిణీ, సూపర్ సిక్స్ పథకాల్లో ఒక పథకంగా చేర్చాలని ఎప్పటినుంచో ఉన్న ఎస్‌సి, ఎస్‌టిలకు భూమి కొనుగోలు పథకం కనుమరుగైందన్నారు. ముందుగా సిపిఐ పతాకాన్ని బోయ పుల్లయ్య ఆవిష్కరించగా శాఖ కార్యదర్శి బోయ రాఘవరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం పలు తీర్మానాలను చేశారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

చింతలపూడి: ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు లేకుండా చూసుకోవాలని, జ్వరం వస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్ఎ.ప్రసాద్ అన్నారు. మండలంలోని వరల్డ్ నెగ్లెకటెడ్ ట్రోపికల్ డీసీజ్‌పై గురువారం అవగహన కల్పించారు. జనవరి 30వ తేదీ వరల్డ్ నెగ్లెకటెడ్ ట్రోపికల్ డీసీజ్ సందర్భంగా చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్ఎ.ప్రసాద్ బోధ వ్యాధి గ్రస్తులకు అవగహన కల్పించారు. ఏరియా ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

తామర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

చాట్రాయి: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చాట్రాయి, చిత్తపూరు, చనుబండ, నరసింహారావుపాలెం, కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో మామిడి తోటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ మాట్లాడుతూ మామిడి పూతలకు తామర పురుగు ఎక్కువగా ఉందని, దాని నివారణకు స్పైనోసాడ్ డి 25 మిల్లీమీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి పెద్దఎత్తున రూ.15 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని బిర్లా భవన్ సెంటర్ నుంచి గడియార స్తంభం కూడలి వరకూ రూ.65 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను ఎంఎల్‌ఎ, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పరిశీలించారు. పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఎంఎల్‌ఎ చంటి ఆదేశించారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ప్రత్యేకంగా సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గవ్యాప్తంగా రహదారుల గుంతలు పూడ్చేందుకు, అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా రోడ్లను నిర్మించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. రూ.15 కోట్ల నిధులతో నియోజకవర్గంలోని రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు. బిర్లా భవన్ సెంటర్ నుంచి నిర్మిస్తున్న ఈ రహదారి నిర్మాణాన్ని రెండురోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ రవిచంద్రకు ఎంఎల్‌ఎ సూచించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శరవేగంగా అమలు చేస్తున్నామన్నారు.

గూటాల జెడ్‌పి హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు

పోలవరం : సైంటిస్ట్ మరింగంటి బాపూజీచే గూటాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సిఎస్ఐఆర్‌లో శాస్త్రవేత్తగా పనిచేసి, పలు విశ్వవిద్యాలయాలకు ఆయన మార్గదర్శకం చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ తెలిపారు. శాస్త్రీయ విజ్ఞానానికి, పరిశోధనకు కృషి చేశారన్నారు. గూటాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కమల ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సైన్స్ ల్యాబ్ నిమిత్తం రూ.1.40 లక్షల పరికరాలు కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చారన్నారు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం కల్పించాలంటే ప్రయోగాలు చేయాలని, ప్రయోగాలు చేసిన అనుభవ జ్ఞానంతో వారు ఎదగాలని కాంక్షిస్తూ ఆయన ల్యాబ్ నిర్మాణానికి నిధులు సమకూర్చడమే కాకుండా ప్రయోగాలు ఎలా చేయాలో పిల్లలకి నేర్పడం, చేయించడం గొప్ప విషయమన్నారు. 74 ఏళ్ల వయస్సులో ఆయనకు శాస్త్ర విజ్ఞానం పట్ల ఉన్న ప్రేమ పిల్లలకు ఆయన నేర్పించే విధానం, చదువు పట్ల ఆయనకున్న అంకితభావం చూసి పలువురు తల్లిదండ్రులు ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని వ్యక్తం చేశారన్నారు. సైన్స్ ల్యాబ్ పిల్లల్లో జిజ్ఞాస పెంచుతుందన్నారు. సైంటిస్ట్ బాపూజీ నుంచి తాము ఎంతో నేర్చుకున్నామని ఉపాధ్యాయులు తెలిపారు.

పూళ్ల అభివృద్ధికి సీతారామయ్య కృషి అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల గ్రామాభివృద్ధికి పుప్పాల మోహన సీతారామయ్య చేసిన కృషి అభినందనీయమని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. పూళ్ల దాని పరిసర ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేసిన పుప్పాల మోహన సీతారామయ్య జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి 32 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శ్రీనివాస్, హరీష్ ఆధ్వర్యంలో పూళ్లలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఆయనతోపాటు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు ఇతర ప్రముఖులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఇదేవిధంగా ఇదే గ్రామపంచాయతీ పరిధిలోని సాయన్నపాలెం వద్ద ఏర్పాటుచేసిన పుప్పాల మోహన సీతారామయ్య విగ్రహానికి పూలమాలలు వేశారు. రెండు చోట్ల నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో 300 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచి డి.సుజాత, మాజీ ఎంపిపి సిరిబత్తిన కొండబాబు పాల్గొన్నారు.

నర్సరీ ఏర్పాటుపై గ్రామస్తుల అభ్యంతరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాజవరం జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన అధికారులు విరమించుకోవాలని గ్రామస్తులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు క్రీడా ప్రాంగణం ఉండదని, విషసర్పాలు నర్సరీలోకి చేరే ప్రమాదం ఉందని తెలిపారు. 2017లో నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2021లో జెడ్‌పి హైస్కూల్లో ప్రభుత్వ మహిళా కళాశాల మంజూరైందని, దీంతో నర్సరీ కేంద్రాన్ని రద్దు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చూస్తున్న ప్రదేశంలో విద్యార్థులకు అణువుగా సైకిల్ స్టాండ్ నిర్మాణానికి ఎస్ఎంసి కమిటీ యోచిస్తోందని తెలిపారు. పైగా నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల నీటి కొరత ఏర్పడుతుందని, హైస్కూల్లోని పంచాయతీ కుళాయి నీటిని నర్సరీకి ఉపయోగిస్తే విద్యార్థుల అవసరాలకు తగినంత నీరు ఉండదని పేర్కొన్నారు. కాగా గతంలో నర్సరీ కేంద్రం ఉండకూడదని తీర్మానం చేసిన ప్రధానోపాధ్యాయులు ఈ సారి ఏర్పాటుకు తీర్మానం చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఐ

ఏలూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానం మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాల అర్జీలు పూర్తిచేసి గురువారం స్థానిక చేపల తూము సెంటర్ వార్డు సచివాలయంలో వార్డు కార్యదర్శికి అందించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ ఇళ్ల స్థలాల అర్జీ కార్యక్రమం ఫిబ్రవరి తొమ్మిది నాటికి పూర్తి చేసుకుని పదో తేదీన కలెక్టర్ కార్యాలయంలో అర్జీల సమర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. గతంలో సెంటు తీసుకున్న ఇళ్ల స్థలాలను రెండు సెంట్లుగా పెంచాలని, కొత్తగా వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేయాలని, పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కన్న బాబు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

భీమడోలు: కుష్టు వ్యాధిని తొలి దశలో గుర్తించి సరైన చికిత్స పొందడం ద్వారా అంగవైకల్యాన్ని అధికమించడంతోపాటు, ఆరోగ్యవంతులుగా కొనసాగవచ్చని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు శ్రీలక్ష్మి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసి పురవీధుల్లో ర్యాలీని నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణకు సంబంధించిన నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు కుష్టు వ్యాధి నివారణకు అవసరమైన మందులు, చికిత్సకు నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, వీరి సేవలను వినియోగించుకోవాలని కోరారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - చింతలపూడి

నాణ్యతలో రాజీ పడకుండా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు సక్రమంగా వేయాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అని గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు.

హామీల అమల్లో చంద్రబాబు విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సిఎం చంద్రబాబు విఫలమయ్యారని వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు విమర్శించారు. ఏలూరులోని వైసిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకొచ్చిన తొమ్మిది నెలల కాలంలో రూ.1.19 లక్షల కోట్ల అప్పులు తీసుకొచ్చారన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వైసిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, జిల్లా బిసి అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, నూకపెయి సుధీర్‌బాబు, దాసరి రమేష్, గంట ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం, కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన దండా రాజశేఖర్ తండ్రి: దండా శ్రీను అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. కృష్ణాయపాలెం మా ఇంటి నుండి ది. 20-1-2025 న తాడేపల్లిగూడెం మోటార్ సైకిల్ పై వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. **పాస్‌పోర్ట్ నెంబర్ N7486737** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

దండా రాజశేఖర్
S/o: దండా శ్రీను
కృష్ణాయపాలెం, తాడేపల్లిగూడెం మండలం
ప॥గో॥ జిల్లా - 534146
సెల్: 96038 83774

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం. ఉండి గ్రామం, రాజులపేట, డోర్ నెం. 16-30 కాపరస్తులు కలిదిండి రాజేష్‌వర్మ S/o కలిదిండి రామచంద్రరాజు అను నా యొక్క **ఒరిజినల్ నెం. 818/1964** గల **దస్తావేజును** 8-11-2024 తేదిన ఉండి గ్రామంలో మెయిన్ సెంటర్‌నకు జిరాక్స్ తీసుకోనుటకు నా ఇంటి వద్ద నుండి మోటారు సైకిల్ పై వస్తుండగా మార్గ మధ్యలో జారి పడిపోయినవి. సదరు ఉండి స.రి. వారి ఆఫీసులో **దస్తావేజు నెం. 818/1964** గల సెటిల్‌మెంట్ ఒరిజినల్ దస్తావేజును నేను దుర్వినియోగపర్చియుండలేదు. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

కలిదిండి రాజేష్ వర్మ
S/o: రామచంద్రరాజు
డోర్ నెం. 16-30, ఉండి గ్రామం,
రాజులపేట, ఉండి మండలం, ప॥గో॥జిలా
సెల్: 8688185799

దస్తావేజులు పోయినవి

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన తణుకు మండలం, తణుకు సజ్జాపురం, Flat No.1, Second Floor, V.K.Chary's Mansion కాపురస్తులు తమిరిస వెంకట కృష్ణమాచారి గారి కుమారుడు చారి గోపాల్ గారి తరుపున తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ది. 20-1-2025 సం॥రం॥ తేదీన హైదరాబాద్ నుండి తణుకు 10-30 గం. సమయమున తణుకు వచ్చి తన తాలూకు ది. 11-4-2008 సం॥ తేదీ **రిజిష్టరు ఒరిజినల్ సెటిల్ మెంటు దస్తావేజులు (Doc No. 376/2008), Doc No. 377/2008** లు జిరాక్స్ తీయించుకుని, ఇంటికి వెళ్తుతూ పళ్ళు కొనుక్కొనుటకు వెంకటేశ్వర దియేటర్ సెంటర్‌లో ఆగి వెళ్ళుచుండగా పైన నుదహరించిన రెండు ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. అవి ఎవరికైనా దొరికిన ఎడల యీ క్రింది నుదహరించిన అడ్రస్సుకు ఇవ్వగోరుచున్నాడు.

వి. సాయికృష్ణ
అడ్వకేట్. తణుకు
తణుకు
29-01-2025
సెల్: 94409 65652

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం
ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి
వారి కోర్టులో
O.S.No. 58/2014

Between:
Padala Sujata ... **Plaintiff**
and
1. Karri Veereddy
2. Karri Harika reddy ... **Defendants**

పై నెంబరు దావా గ్రంథములో 2nd Defendant నకు శ్రీ కోర్టు వారు కోర్టు ద్వారాను, మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికిని తీసుకొనకుండా Avoid చేస్తున్నందున Order 5 Rule 20 ప్రకారం Substitute of Service ద్వారా అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డర్ వేసినందున పై నెంబరు దావా గ్రంథములో **ది.18-02-2025 సం॥ తేదీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియడల పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

A.Dasaradha Ram
Advocate
Tadepalligudem, W.G.Dt
Tadepalligudem
Date: 27-01-2025
Cell: 70136 60425

దస్తావేజు పోయినది

ప॥గో॥జిల్లా, యలమంచిలి మండలం, మేడపాడు గ్రామ కాపురస్తులు శ్రీ యీడేపల్లి హరికంత వెంకట రమేష్ S/o వెంకటేశ్వరరావు మాకు ఇచ్చిన సంజాయిషిపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు నానమ్మ గారైన శ్రీమతి యీడేపల్లి దమయంతి రామస్వామి గారు, వారి కుమారుడైన శ్రీ యీడేపల్లి వెంకటేశ్వరరావు గారి పేరున ది. 26-12-2005 సం॥ తేదీన రిజిష్టర్ దాన సెటిల్‌మెంట్ దస్తావేజు వ్రాసి **దస్తావేజు No. 6182/2005** గా పాలకొల్లు సబ్ రిజిష్టారు వారి కార్యాలయంలో రిజిష్టర్ చేసిన దస్తావేజు ఇది. ఈ స్థలం వివరాలు రి.స.నెం. 163/8 సమీప డోర్ నెం. 1-63, హద్దులు, తూర్పు-రోడ్, వెస్ట్-6 అడుగుల ఉమ్మడి రోడ్, నార్త్-ఓదూరి సత్యనారాయణ భూమి కి ఆనుకొని 6 అడుగుల ఉమ్మడి రోడ్, సౌత్-యీడేపల్లి పరమేశ్వరరావు స్థలం ది. 30-12-2024 సం॥ తేదీన మా క్లయింటు జిరాక్స్ తీయించు నిమిత్తం మేడపాడు సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది. తదుపరి ఎంత వెదికినను, సదరు దస్తావేజు దొరకలేదు.

కావున సదరు దస్తావేజు ఎవరికైనను దొరికినచో మా క్లయింటునకు అప్పగించవలసినదిగా కోరడమైనది. అందు నిమిత్తం తగు ఖర్చులు యివ్వబడును.

సదరు దస్తావేజు దొరికినవారు మా క్లయింటునకు అందజేయక సదరు దస్తావేజుపై జరిపే లావాదేవీలు మా క్లయింటును బైండోవరు చేయవని యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

జి.కె.ఎన్. సింహా M.A.,M.L
అడ్వకేట్.
పాలకొల్లు
పాలకొల్లు
29-01-2025
సెల్: 94404 39261

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE VIKARABAD DIST. AT: VIKARABAD
O.S.No. 52 OF 2023

Between:
Shakeel Ali Khan. ...Plaintiff.
A N D
Syed Mohammed Hussaini & Others. ...Defendants.

To, Defendant No. 6. Somishetty Sujatha W/o Somishetty Ramesh Babu, Aged about 45 years, Occ: Housewife, R/o H.No. 12-27-1/32, Ikya nagar colony, Flat no. B-11, Reliance Petrol Bunk, Tanaku, A.P. 534211.

Take notice that the Above O.S. No. 52 of 2023 filed for specific performance of agreement of sale Dt. 24-09-2018 in respect Suit schedule property, the above suit is posted on 24-02-2025, for your appearance in person or through advocate, failing which the case will be decided in your absence.

BY ORDER OF THE COURT

Mohd. Mazhar Ali,
Advocate.
H.No.12-2-800/50,
Dilshad Nagar Colony,
Colony, Rethi Bowli, Hyd-28.
Ph: 9246375870.
Counsel for Plaintiff.